క్లుప్తంగా

నేడు బిక్కవోలులో పీజీఆర్ఎస్‌కు కలెక్టర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బిక్కవోలు మండలంలో సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యాక్రమానికి కలెక్టర్ ప్రశాంతి హాజరవుతున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌కి జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు.

కక్ష పూరితంగా ఫ్లెక్సీల చింపివేత

మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుమర్తి చిన్న తదితరులు

సీటీఆర్ఐ: ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్ ఫ్లెక్సీలను చింపివేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకుదిగుతామని మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఆకుమర్తి చిన్న హెచ్చరించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొవ్వూరు మండలం పశివేదలలో ఈ నెల 20వ తేదీన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ఫ్లెక్సీలను కూటమి నాయకుడైన పెండ్యాల అచ్చుతరామయ్య చౌదరి వర్గం వారు చింపేవేయడం దారుణమన్నారు. దళిత వర్గానికి చెందిన ఒకరికి పదవి వస్తే ఈవిధంగా చేయడం దారుణమన్నారు. పోలీసులకు సమాచారం అందించినప్పటికీ నిమ్మకి నీరెత్తినట్లు ఉండటం భావ్యం కాదన్నారు. దళితల మధ్య గ్రూప్‌లను ఏర్పాటు చేసి వారిని రెచ్చగొట్టే విధంగా చేస్తున్న అచ్చుతరామయ్య చౌదరిపై చర్యలు తీసుకోకపోతే ఈ నెల 24వ తేదీన ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

జంతు సంరక్షకులకు చట్టాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జంతు సంరక్షకులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలో జంతు సంరక్షకులకు యానిమల్ రెస్క్యూ అర్గనైజేషన్, హ్యూమన్ వరల్డ్ ఫర్ ఎనిమల్స్ ఇండియా ఫౌండేషన్, శ్రీ సుమతి నాథాజీ జీవదయ ట్రస్ట్‌ల సహకారంతో జంతు సంరక్షణ చట్టాలపై ఆదివారం స్థానిక టి.నగర్‌లోని పర్ణశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జంతువులను కాపాడే లక్ష్యంతో ఏ విధంగా జంతు ప్రేమికులు పని చేయాలో పలువురు వక్తలు దిశానిర్దేశం చేశారు. జంతువులపై జరుగుతున్న అమానవీయ ఘటనలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ చర్చలలో భాగంగా పశువుల సంతలలో జరుగుతున్న చట్ట ఉల్లంఘనలు, వీధి కుక్కల జనన నియంత్రణ కార్యక్రమంలో జరుగుతున్న అవకతవకలు, వీధి కుక్కలకు ఆహారం అందించే వారికి కలుగుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాల గురించి నిపుణులు పలు చట్టాలపై జంతు సంరక్షకులకు అవగాహన కల్పించారు. యానిమల్ రెస్క్యూ అర్గనైజేషన్, హ్యూమన్ వరల్డ్ ఫర్ ఎనిమల్స్ ఇండియా ఫౌండేషన్, శ్రీ సుమతి నాథాజీ జీవదయ ట్రస్ట్‌ల ప్రతినిధులు గోపాల్, తేజోవంత్, ధర్మేంద్ర, రచనాజైన్, పలు జిల్లాల నుంచి జంతుప్రేమికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇంటర్నేషనల్ చెస్ డే



చదరంగం టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

రాజమహేంద్రవరం సిటీ: చదరంగంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు కాల్‌ఫ్యూజన్ చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ తెలిపారు ఆదివారం దానవాయిపేట అకాడమీలో రాజమండ్రి లైన్స్ క్లబ్ సహకారంతో అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్విటేషన్ చదరంగం టోర్నమెంట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సుమారు 150 మంది పిల్లలతో ఈ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అంతజేసినట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో రోషిత నాయుడు (మొదటిబహుమతి), డి.రుత్విక్ (రెండో బహుమతి), వాకలపూడి లతిక (మూడో బహుమతి) గెలుచుకున్నారన్నారు.

మ్యాన్ హోల్స్.. డేంజర్ బెల్స్



పుష్కరఘాట్‌లో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టకుండా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బోర్డు



లక్ష్మీవారపుపేటలో కాలువపై నిర్లక్ష్యంగా వదిలేసిన శ్లాబ్



నారాయణపురం బ్యాడ్మింటన్ కోర్టు వద్ద దెబ్బతిన్న మ్యాన్ హోల్

- పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం
- జనం భద్రత పట్టని నగరపాలక సంస్థ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా నగరంలో పలు ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్, కాలువలపై శ్లాబ్‌లు ప్రమాదకరంగా తయారు కావడంతో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దెబ్బతిన్న మ్యాన్ హోల్స్, కాలువలపై శ్లాబులను సరిదిద్దాల్సిన పారిశుధ్య సిబ్బంది ఇష్టారాజ్యంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రాత్రి సమయాల్లో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈ విధమైన పరిస్థితులు నెలకొని ఉన్నా నగరపాలక సంస్థ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరంగా ఉంది. మ్యాన్ హోల్ పూర్తిగా దెబ్బతిని ప్రమాదాలు జరిగిన తర్వాత మాత్రమే దృష్టి పెడుతున్న నగరపాలక సంస్థ అధికారులు మొదటి దశలోనే గుర్తించి మరమ్మతులు చేపట్టే చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్ హోల్ దెబ్బతింటుందని మొదటిదశలో గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపడితే పూర్తిగా పాడయ్యే పరిస్థితి ఉండదని, అదేవిధంగా ప్రమాదాలు కూడా నివారించవచ్చునని స్థానికులు అంటున్నారు. మ్యాన్ హోల్స్ పాడయితే ప్రమాదాలు జరగుతాయనే విషయాన్ని నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది గుర్తించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో చెత్తను తొలగించాక శ్లాబులను తిరిగి యథావిధిగా ఏర్పాటు చేయడంలో సైతం పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. పలుచోట్ల శ్లాబ్‌లను అస్తవ్యస్తంగా వదిలివేస్తున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు శ్లాబు పలకలను గుద్దుకుని ప్రమాదాల పాలవుతున్నారు. ఇప్పటికై నా నగరపాలక సంస్థ సిబ్బంది అధికారులు శ్లాబులను యథాస్థితిలో ఉంచడంపై శ్రద్ధ చూపాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. దెబ్బతిన్న మ్యాన్ హోల్స్ వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు మరో ప్రమాదాన్ని కొని తెచ్చిపెట్టే విధంగా రాళ్లు ఏర్పాటు చేస్తున్నారని ఇది సరైన విధానం కాదంటూ నగర ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. ఇప్పటికై నా అధికారులు ప్రత్యేక దృష్టిసారించి నగరంలో మ్యాను హోల్స్, కాలువలపై శ్లాబులు సక్రంగా ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



దెబ్బతిన్న మ్యాన్ హోల్స్‌కు వెంటవెంటనే మరమ్మతులు చేపడితే నగర పాలక సంస్థకు ఆర్థిక భారం తప్పుతుంది. పూర్తిగా పాడయిన తరువాత మరో మ్యాన్ హోల్‌ను ఏర్పాటు చేసేలోపు ప్రమాదాలు జరుగుతున్నాయి.

– బస్సా రామ్‌కుమార్, రాజమహేంద్రవరం

నగరంలో చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి



కాలువలపై మ్యాన్ హోల్స్, శ్లాబ్‌లు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం వల్ల ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించే పారిశుద్ధ సిబ్బంది దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్, కాలువలపై సక్రమంగా లేని శ్లాబులను గుర్తించి పై అధికారులకు సమాచారం ఇవ్వడంలో విఫలమవుతున్నారు. ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలి.

–గుడిమెట్ల వెంకటరెడ్డి (బాలాజీరెడ్డి), రాజమహేంద్రవరం

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు రాజకీయ కుట్ర

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి మీర్జామౌలా ఆలీ



రాజమహేంద్రవరం రూరల్: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టు పూర్తిగా రాజకీయ కుట్రలో భాగంగా జరిగిందని, మిథున్‌రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి మీర్జా మౌలా ఆలీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మిథున్‌రెడ్డి ఎప్పుడూ పేద ప్రజల పక్షాన మైనారిటీ హక్కుల పరిరక్షణ కోసం పాటుపడిన వ్యక్తి అన్నారు. అటువంటి మిథున్‌రెడ్డిని అవాస్తవ ఆరోపణలతో అరెస్టు చేయడం అమానుషమన్నారు. మిథున్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలని, అరెస్టు వెనుక ఉన్న కుట్రలను బయటపెట్టాలని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించేలా ప్రభుత్వం వ్యవహరించాలని మీర్జా మౌలా ఆలీ డిమాండ్ చేశారు.

గ్రామీణ అభివృద్ధి లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ: రైతుల అమూల్య సేవలను గౌరవించడమే కాక, జాతీయ బ్యాంకులు వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా చేసుకున్నాయని బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్లు ఎం.సుభాకర్, నికేష్‌కుమార్‌సిన్హా పేర్కొన్నారు. ఆదివారం బ్యాంక్‌ల జాతీయకరణ దినోత్సవం సందర్భంగా సీతంపేట కార్యాలయంలో కిసాన్ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేద, వెనుకబడిన ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలను విస్తరించే దిశగా కట్టుబడి పని చేస్తోందన్నారు.



కాతేరు చెరువు వద్ద రోడ్డుపై గొయ్యి



ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద గోతులు



గామన్ బ్రిడ్జి వద్ద ఇలా..

అడుగడుగునా గోతులే...

కాతేరు గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై అడుగుఅడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డులో ఆర్‌టీసీ బస్సులు, స్కూలు బస్సులు, వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ రోడ్డుపై గోతుల వల్ల వాహన చోదకులు రాత్రి సమయంలో కిందపడి గాయాల పాలవుతున్నారు. అయినా ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం రోడ్లపై గోతులను పూడ్చి సంక్రాంతి పండగను తెస్తామంటూ ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఆచరణలో విఫలమైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

– రాజమహేంద్రవరం రూరల్

ఓనువులమ్మకు ఆషాఢం సారె



ఓనువులమ్మతల్లి అమ్మవారికి సమర్పించిన ఆషాఢం సారె

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో గల ఓనువులమ్మ తల్లి ఆలయంలో ఆదివారం గ్రామస్తులు అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా సారె సమర్పించారు. 150 రకాల స్వీట్స్, పండ్లను గ్రామ వీధుల్లో మేళా తాళాలతో, గరగ నృత్యాలతో ఊరేగించి, అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారికి ప్రత్యేక పూజల చేసిన అనంతరం భక్తులకు సారెను ప్రసాదంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్యం నుంచీ ఆధ్యాత్మిక చింతన ఉండాలి

రంగంపేట: విద్యార్థులు బాల్యం నుంచీ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, దీనికి బాల వికాస్ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని బాల వికాస్ గురువులు పప్పు దేవి, తిమ్మలపూడి హైమావతి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాత వీరంపాలెం గ్రామంలో కోదండ రామాలయంలో నిర్వహించిన సత్యసాయి బాల వికాస్ తరగతులలో వారు మాట్లాడారు. నిద్ర లేచింది మొదలు నిద్ర పోయేవరకు చేయాల్సిన ప్రార్థనలు, పద్య సూక్తులు, కథలు, భజన పాటల గురించి వివరించారు. భజన మండలి కన్వీనర్ నాగులపల్లి సూర్య భాస్కరరావు, బాల వికాస్ గురువు తెల్లాకుల చక్రధర్, సేవాదళ్ సభ్యులు నాగులపల్లి సహదేవుడు, సత్యవాణి, బాల వికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ స్టాఫ్‌నర్స్‌కు సత్కారం

కోరుకొండ: మండలంలోని దోసకాయలపల్లి పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్స్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న చిల్లా లలితకుమారిని ఆదివారం యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ ఘనంగా సత్కరించింది. మహమ్మారి కోవిడ్ సందర్భంలో వైద్యసేవలందజేసినందుకుగాను ఈ సత్కారం జరిగింది. కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు చేతులమీదుగా సత్కరించారు. యంగ్ మైండ్స్ వ్యవస్థాపకులు వెంకటరమణ మాట్లాడుతూ కరోనా సందర్భంలో వైద్యులు, నర్సులు సేవలందజేయడంతో ప్రజలు ప్రాణాలతో ఉన్నారన్నారు. అలాంటి సేవలందించిన వారిని సత్కరిస్తున్నట్టు తెలిపారు.

యేసయ్య పట్ల విశ్వాసంతో నిత్యదీవెనల ప్రాప్తి

రెవరెండ్ ఫాదర్ మనోజ్‌కుమార్

కోరుకొండ: క్రైస్తవుల ఆరాధ్య దైవమైన యేసుక్రీస్తు పట్ల విశ్వాశాన్నుంచుకుంటే నిత్యదీవెనలందుకోవచ్చని ఆర్‌సీఎం రెవరెండ్ ఫాదర్ బి.మనోజ్‌కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిగ్రామంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వాక్యసందేశంలో ఆయన మాట్లాడుతూ కరుణామయుడైన యేసుక్రీస్తు ప్రజలను క్షమిస్తూ, ఆశీర్వాదాలను అందిస్తారన్నారు. అయితే ఆయన పట్ల విశ్వాశాన్ని పెంచుకోవాలన్నారు. నిత్యం బైబిల్ పఠనం ద్వారా విజ్ఞానాన్నిపెంపొందించుకోవచ్చన్నారు. మిషనరీకి చెందిన మఠకన్యలు ఉదయం నుంచి బూరుగుపూడిలోని ఆర్‌సీఎంకు చెందిన క్రైస్తవుల ఇంటింటికీ వెళ్లి, యోగక్షేమాలను తెల్సుకొని, ప్రార్థనలు చేశారు. సేవలందజేసిన మఠకన్యలకు స్థానిక సంఘస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రార్థనలో స్థానిక ఉపదేశి కొల్లి జాకబ్, సంఘపెద్దలు గెడ్డం రత్నం, కాతేటి జార్జి, చుక్కా శ్యామల, పెనుమాకుల నిర్మల, కందుకూరి పండు పాల్గొన్నారు.

సౌందర్యానికి, వస్త్రధారణకు ప్రాధాన్యం

'హలో సలోన్' ప్రారంభోత్సవంలో మాజీ ఎంపీ భరత్‌రామ్, నటి తేజస్వీరావు



మాజీ ఎంపీ భరత్‌రామ్, నటి తేజస్వీరావుతో సెలూన్ నిర్వాహకురాలు శ్రావణి

రాజమహేంద్రవరం సిటీ: సౌందర్యానికి, వస్త్రధారణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, కమిటీ కుర్రోళ్లు చిత్రం హీరోయిన్ తేజస్వీరావు అన్నారు. నగరంలోని తిలక్‌రోడ్‌లో ఈతకోట శ్రావణి నూతనంగా ఏర్పాటు చేసిన 'హలో సలోన్-అకాడమీ'ని హీరోయిన్ తేజస్వీరావ్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ హీరోయిన్ తేజస్వీరావు ప్రారంభించిన కొత్త సెలూన్ అభిరుచి, కృషి, సౌందర్య సేవలకు ప్రతిబింబంగా నిలుస్తుందని ఆకాంక్షించారు. సేవలను నగర ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. స్థానిక ప్రాధాన్యతలు, సంప్రదాయ పద్ధతులకు అనుగుణంగా ఫ్యాషన్ ఔత్సాహికులు, సౌందర్య ప్రియులకు నచ్చే సేవలను అందించాలని కోరారు. హీరోయిన్ తేజస్వీరావును చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. ఈ సందర్భంగా తేజస్వీరావు మాట్లాడుతూ కమిటీ కుర్రోళ్లు చిత్రం తనలోని నటన చూపేందుకు ఎంతగానో దోహదం చేసిందన్నారు. బుల్లితెర మీద ఆదరించినట్టుగానే చిత్ర పరిశ్రమలో కూడా ప్రేక్షకులు తనకు ఆదర అభిమానాలు చూపుతారని ఆశిస్తున్నానని అన్నారు.'' హలో సలోన్ – అకాడమీ నిర్వాహకురాలు అధునాతన బ్యూటీషియన్, ఫ్యాషన్ సేవల్లో నిపుణురాలని పేర్కొన్నారు. 'హలో సలోన్-అకాడమీ' ప్రోగ్రామ్‌ల ద్వారా ఔత్సాహిక బ్యూటీషియన్లకు సాధికారత కల్పించనున్నట్లు ఈతకోట శ్రావణి పేర్కొన్నారు.

శాకంబరిగా దానవాయి అమ్మవారు



రాజమహేంద్రవరం రూరల్: కాతేరు మల్లయ్యపేట గ్రామదేవత మానస దానవాయి ఆలయంలో అమ్మవారు ఆదివారం శాకంబరిదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారికి కాయగూరలు, పండ్లు, నివేదించడం ద్వారా పంటలు సుభిక్షంగా పండుతాయని, ప్రజలు ఆరోగ్యాలతో ఉంటారని ప్రజల నమ్మకమని ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం మొత్తం కురగాయలతో, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల రాకతో మానస దానవాయి అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి 51రకాల పిండివంటలు, పండ్లతో ఆషాఢం సారె సమర్పించారు. గరగనృత్యాలతో ఆషాఢం సారెను గ్రామవీధులలో ఊరేగింపుగా దానవాయి అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కొల్లగట్టు.. కాసులు పట్టు

- యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు
- కాలువ గట్లనూ తవ్వేస్తున్న వైనం
- అక్రమార్కులకు కాసుల పంట
- నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధి సపోర్టు



రెవెన్యూ అధికారులకు స్థానికులు అప్పగించిన మట్టి లారీలు

రాజానగరం: జిల్లాలో రాజానగరం నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ పేరు వినగానే ఠక్కున గుర్తుకు వచ్చేది గోదావరి ఇసుక. దీనితోనే పాలకులు కోట్లాది రూపాయలు గడిస్తున్నారనేది జగమెరిగిన సత్యం. ఇప్పుడు దీనికి మట్టి కూడా తోడైంది. ఇక తెలియంది ఏముంది, మట్టి తవ్వకాలతో నియోజకవర్గంలో కొండలు సైతం కరిగిపోతున్నాయి. ఏడాది కాలంగా సాగుతున్న ఈ అక్రమ దందా చెరువు, కాలువ గట్లకు కూడా విస్తరించింది. మట్టి గుట్ట కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే మాయమై పోతుంది. ఈ క్రమంలో మట్టి మాఫియా కన్ను పోలవరం కాలువ గట్లపై కూడా పడింది.

అక్రమ దందా

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పోలవరం ప్రాజెక్టులో భాగంగా కాలువను తవ్వి, దానికి ఇరువైపులా కొండల్లా మట్టి గుట్టలు పెట్టారు. రాబోయే కాలంలో కాలువ వెంబడి, రహదార్లను అభివృద్ధి చేయవచ్చనే ఆలోచనో ఏమోగానీ దశాబ్ద కాలంగా ఆ కాలువ గట్ల జోలికి ఎవ్వరూ వెళ్లలేదు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల ద్వారా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారులో స్థానిక పాలకులు అక్రమ దందాకు తెరలేపారు. గోదావరి ఇసుకతో దందాను ప్రారంభించిన వారు క్రమేపీ కొండలను తొలి చేసి, చెరువులను తోడేసి, చివరకు పోలవరం కాలువ గట్లను కూడా వదలకుండా తవ్వేస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా భారీ వాహనాల్లో తరలి పోతున్న మట్టి రవాణాతో రోడ్లు పాడై, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వారికేమి పట్టనట్టగా ఉంటున్నారు. విసిగిపోయిన ప్రజలు ఆ లారీలను అడ్డుకుని, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆపిన వాహనాలు గంటల్లో ఆయా ప్రాంతాల నుంచి మాయమై, యథాతథంగా అక్రమ రవాణాను కొనసాగించడం విశేషం.

తెల్లవారాక చూస్తే మాయం

అర్ధరాత్రి పట్టుకుని, అధికారులకు అప్పగించిన మట్టి లారీలు.. తెల్లవారాక చూస్తే కనిపించలేదు. ఎక్కడి దొంగలు అక్కడ గప్ చిప్ అన్నట్టుగా మాయమైపోయాయి. మండలంలోని కలవచర్ల వద్ద ఉన్న పోలవరం కాలువ గట్ల నుంచి మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది లారీలను గురువారం రాత్రి స్థానిక యువకులు కొందరు అడ్డుకుని, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని కూడా అధికారులు చెప్పారు. ఇంతలోనే పైఅధికారుల నుంచి వర్తమానాలు రావడంతో వాటిని వదిలేశారు. అదేమని ప్రశ్నిస్తే వాటికి అనుమతులున్నాయంటూ సమాధానమిచ్చారు.

నిర్ణీత సమయం లేకుండా అనుమతులు

పోలవరం ప్రధాన కాలువ గట్టును తవ్వి, మట్టిని రవాణా చేసేందుకు కొందరు వ్యక్తులకు ఆ కాలువకు సంబంధించిన ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. అయితే ఈ అనుమతులు ఎప్పుడు ఇచ్చారు. ఎప్పటి వరకు, ఏ మేరకు మట్టిని తీసుకువెళ్లవచ్చు అనే ప్రధాన విషయాలు లేవు. ఆ అనుమతులను చూపించి, సంబంధింత వ్యక్తులు రెవెన్యూ అధికారులకు అప్పగించిన మట్టితో కూడిన లారీలను తీసుకుపోయారు. 9500 క్యూబిక్ మీటర్ల మట్టిని తీసుకువెళ్లేందుకు అనుమతి ఉందిగానీ దానికి నిర్ణీత సమయం అంటూ ఆ అనుమతుల్లో లేకపోవడంతో లారీలను ఆపిన ప్రతిసారీ వాటిని ఫ్రెష్‌గా చూపించి, అక్రమార్కులు తమ దందాను కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిజానికి ఇదే అనుమతులను పరిగణనలోకి తీసుకుంటే 1,580 లారీలతో అనుమతులు అయిపోతాయి. కానీ నెలల తరబడి తరలింపు జరుగుతూనే ఉంది. అంతేకాదు ఈ అక్రమ దందాలో అధికారుల నుంచి అనుమతులు తీసుకునే ప్రాంతం ఒకటి, తవ్వే ప్రాంతం మరొకటిగా ఉంటుంది. సమస్యలొస్తే అనుమతులు పొందిన ప్రాంతాన్ని చూపిస్తున్నారు, లేకుంటే వారికి అనుకూలంగా ఉన్న ప్రాంతం నుంచి యథేచ్ఛగా రవాణా జరిగిపోతోంది.

నియోజకవర్గ ప్రతినిధి కీలకం

ఇసుక, మట్టి అక్రమ దందాలో నియోజకవర్గ ప్రతినిధిగా ఉన్న వ్యక్తిదే ప్రధాన పాత్ర. ఆయనకు తెలియకుండా ఒక్క లారీ కూడా బయటకు వెళ్లదు. ఆయన చెప్పే మాటలకు, చేసే పనులకు అస్సలు సంబంధమే ఉండదనడానికి ఇక్కడ జరుగుతున్న ఇసుక, మట్టి అక్రమ రవాణాయే నిదర్శనం. రాజానగరంలో తెల్లవారే సరికే స్థానికులు పట్టిచ్చిన మట్టి లారీలు మయామయ్యాయంటే ఈ అక్రమ దందా ఎలా జరుగుతోందో గమనించవచ్చు.

– గంగిశెట్టి సోమేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, పాలచర్ల